ప్రజాశక్తి
మంగళవారం 20 మే 2025
I
అల్లూరి సీతారామరాజు

చిన్న పిల్లల వార్డును సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు జిజిహెచ్ పని తీరుపై సమీక్షలో భాగంగా చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న పలువురు చిన్నారులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. సోమవారం ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ వివిధ వార్డులు పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. చిన్న పిల్లల వార్డులో మలేరియాకు చికిత్స తీసుకుంటున్న చిన్నారి సుకూరు మహాలక్ష్మికి రక్తం తక్కువ ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆ చిన్నారి తల్లిదండ్రులు బాబురావు దంపతులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కలెక్టర్ వెంటనే డాక్టర్లు పరీక్షించి అవసరమైన రక్తం ఎక్కించాలని ఆదేశించారు. బి పాజిటివ్ రక్తం అందుబాటులో లేనందున అక్కడే ఉన్న రెడ్ క్రాస్ ప్రతినిధిని రక్తం సరఫరా చేయాలని సూచించారు. ఈ సందర్భనలో జేసి ఎంజే అభిషేక్ గౌడ, ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వ మిత్ర, డిఎంహెచ్ఓ జమాల్ బాషా, గైనకాలజీ హెడ్ నరశింగ రావు, జనరల్ మెడిసిన్ హెడ్ సురేష్, రెడ్ క్రాస్ ప్రతినిది సూర్యా రావు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య

‣ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నేతల పిలుపు ‣మన్యంలో వర్ధంతి కార్యక్రమాలు

అరకులోయలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయరూరల్: పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, అంటరానితనం నిర్మూలన, అందరికీ చదువు, విద్య, వైద్యంపై ఎన్నో పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన ఆస్తిని ప్రజా సేవకు అంకితం చేస్తూ వేలాది ఎకరాలు పేదలకు పంచిపెట్టిన వ్యక్తి సుందరయ్య అన్ని కొనియాడారు.దోపిడి రాజ్యం నుండి విముక్తి కోసం, శ్రమజీవులను ఐక్యం చేసి ఎన్నో పోరాటలు నిర్వహించరన్నారు. ఉద్యోగాల నియామకంలో శత శాతం గిరిజనులకు కేటాయిం చాన్నారు. ఈనెల 20వ జరుగుతున్న కేబినెట్ సమావేశంలో శత శాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకు కేటాయించే విధంగా నియామక చట్టం కోసం తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.ఆదివాసి ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాల అమలు కోసం ఉద్యోగ, ఉపాధి సాధన కోసం యువతి యువకులు పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, మండల నాయకులు పొద్దు బాలదేవ్, కొర్రా మగ్గన్న, పాంగి రామన్న, పాంగి నాని బాబు, బాలకృష్ణ, ప్రభుదాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని అదే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస పిలుపు నిచ్చారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్య 40 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి ముందుగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలనరస మాట్లాడుతూ, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శ ప్రాయమని కొనియాడారు.పార్లమెంటుకు సైకిలు మీద వెళ్లిన ఏకైక వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎల్. సుందరావు, దాస్, జీవన్, చిన్నారావు, కార్తీక్, పాల్గొన్నారు.

పాడేరులో నివాళి అర్పిస్తున్న అప్పలనర్స

పెదబయలు: మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, స్ఫూర్తి, అమృత దేవి సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో.....

చింతపల్లి: మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు గడుతూరి సత్యనారాయణ, అప్పలనరస, సత్యవతి, భవాని, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: సుందరయ్య జీవితం ఆదర్శప్రాయమని అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు దీసరి. గంగరాజు తెలిపారు. గిరిజన సంఘం కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి కిల్లో మోస్య ఆధ్వర్యాన జరిగిన వర్ధంతిలో సుందరయ్య చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమెల. నాగులు, సీవేరి. కొండలరావు, గెమ్మెల భీమరాజు, రాజారావు, మల్లన్న పాల్గొన్నారు

కూనవరంలో...

విఆర్ పురం: దక్షిణ భారతదేశంలో సిపిఎం నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విఆర్ పురం రాజీవ్‌గాంధీ సెంటర్‌లో స్తూపం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుంజా నాగిరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి నివాళలర్పించారు. అనంతరం రేకపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, ఎంపిపి శ్రీమతి కారం లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్ , కమ్మసిచ్చు సత్యనారాయణ, చీరపు తాతబాబు, శ్రీరామమూర్తి, జల్లి సత్యనారాయణ,కాంతారావు, రాజు, ప్రకాష్, సుబ్బారావు పాల్గొన్నారు.

విఆర్ పురంలో..

కూనవరం: స్థానిక మార్త శ్రీరామమూర్తి భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, జిల్లా కమిటి సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బోర్రయ్య, బాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, ఎంపిటిసి జయసుధ శాఖకార్యదర్శులు ఈశ్వర్, కట్టం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎటపాక : స్థానిక సిపిఎం కార్యాలయంలో పులుసు బాలకష్ణ అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ మర్లపాటి నాగేశ్వరరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ ఐ.వి. మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్‌దొర, ఐ.పద్మ, బుద్దుల భద్రయ్య, జి.హుస్సేన్, జి.హరి, సవలం రాము, ఇరపా అజయ్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమి సభ్యులు ఐ.వి.

రాజవొమ్మంగి: మండలంలో దుర్గానగరంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి చెక్ లెంత్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి మండల నాయకులు పాండవుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొత్తూరు రాంబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎటపాకలో...

ఏజెన్సీలో భారీ వర్షం

ఐటిడిఎ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో నిలిచిన నీరు

ప్రజాశక్తి- రంపచోడవరం : భారీవర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సుమారు గంటన్నర సేపు వర్షం కురవడంతో జనజీవనం ఎక్కడికెక్కడ స్తంభించిపోయింది. రంపచోడవరంలో సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రంపచోడవరం లోని పలు ప్రాంతాలు, అంబేద్కర్ సెంటర్, ఐటిడిఎ ఎదురుగా ఉన్న రోడ్డు జలమయమయ్యాయి. వర్షంతో పాటు ఈదురుగాలి కూడా వీచడంతో సుమారు గంట సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చింతూరు: వేసవితీవ్రతతో అల్లాడుతున్న గ్రామస్తులు సోమవారం మధ్యాహ్నం చిరుజల్లులు కురవడంతో ఉపశమనం పొందారు. వాతావరణ ఒకసారిగా మబ్బులు కమ్మి అనంతరం వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ఉక్కపోత నుంచి ఉపశమనం దొరికిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలను గ్రీవెన్స్ ద్వారా పరిష్కరిస్తున్నామని ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఐటిడిఎ ఎపిఒ జనరల్ రమణ పాల్గొన్నారు. పిఒ మాట్లాడుతూ ఈ వారం 43 వినతులు అందాయని తెలిపారు.

ప్రతి గ్రామంలో ఫాగింగ్

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఎ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏడు మండలాల పంచాయతీ పరిధిలో గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ఎక్కడికక్కడ ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతి పంచాయతీ, సచివాలయాల పరిధిలో ఫాగింగ్ మిషన్లు మరమ్మతులు ఉంటే వెంటనే బాగుచేయించాలన్నారు. అన్ని మండలాలకు సంబంధించిన ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఫాగింగ్ చేయించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడు మండలాల్లోని అన్ని గ్రామాల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించేందుకు డాక్టర్ స్పందన పర్యవేక్షణలో వైద్యాధికారులు హరికృష్ణ, సాయిరతన్, కెవిన్, నాగార్జునను ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో రక్తహీనత ఉన్నవారిని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందిస్తామని తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: లబ్ధిదారులు తీసుకున్న బ్యాంకురుణాలు సకాలంలో చెల్లించాలని రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు నుంచి వివిధరకాల రుణాలు పొందిన డ్వాక్రా, వ్యవసాయ, వ్యాపార ఇతర రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించడం ద్వారా మళ్లీ రుణాలు పొందే దుకు అవకాశం ఉంటుందన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే అధిక రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఖాతాదారులు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదించాలని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి- రంపచోడవరం : ఐటిడిఎ రంపచోడవరం చింతూరు పరిధిలోని ఏకలవ్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. (రాజవొమ్మంగి 30, మారేడుమిల్లి 30, వై.రామవరం 30, చింతూరు 31) మొత్తం 121 సీట్లు ఖాళీగా ఉన్నాయి. పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ఉపసంచాలకులు తెలిపారు. సిబిఎస్ఇ సిలబస్‌తో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఎంపిసి, బైపిసి, హెచ్‌ఈపి, హెచ్‌ఇజి (గ్రూపులో మిగులు సీట్లకు మాత్రమే) విద్యార్థులు నేరుగా ఆయా పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు అందించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కన్వీనర్, ప్రిన్సిపాల్, ఏకలవ్య పాఠశాల, మారేడుమిల్లి చిరునామాలో సంప్రదించాలని తెలిపారు.

కలెక్టర్ చొరవతో మృతదేహం తరలింపు

ప్రజాశక్తి-పాడేరు: వంట్లమామిడి పంచాయతి 12వ మెయిలు రాయికి చెందిన కొర్ర సంతోష్ కుమార్ ఆదివారం పిడుగుపాటుకు మృతి చెందడంతో పాడేరు జిజిహెచ్‌కు తీసుకురాగా పోస్టుమార్టం ఆలస్యం అయిందన్న విషయం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ దృష్టికి విచ్చింది. అప్పుడే జిజిహెచ్ సమీక్ష ముగించుకుని వెళ్లబోతున్న ఆయన కారు దిగి మృతుడు భార్య కొండతల్లిని పరామర్శించి వెంటనే పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని వారి ఊరికి చేర్చాలని ఆదేశించారు. అప్పటికప్పుడు పోస్టుమార్టం నిర్వహించి ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వమిత్ర డిఎంహెచ్ఓ జమాల్‌బాషా సూచనలతో వాహనంలో మృతదేహం వారి ఊరికి తరలించారు.

మానవహారం నిర్వహిస్తున్న సిహెచ్ఒలు

సిహెచ్ఒల ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు: ఏపీ ఎంసీఏ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 22వ రోజు కొనసాగింది. ఈ సమ్మెలో భాగంగా సోమవారం పాడేరు జిల్లా కేంద్రంలో సిహెచ్వోలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న సిహెచ్ఓలను రెగ్యులర్ చేయాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతనం సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని. ఎఫ్ఆర్ఎస్ నుంచి సిహెచ్ ఓలకు మినహాయింపు నివ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని సిహెచ్ఓలు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుర్గ భవాని, చంద్రకళ పవన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని మాదల గ్రామ పంచాయతీ దాబుగుడ గ్రామంలో తాగు నీరు సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేశారు. దాబుగుడ గ్రామంలో తాగు నీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బోరు వద్ద నిరసన చేపట్టారు. దాబుగూడ సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నారని, గ్రామములో మంచినీరు సదుపాయం లేకపోవడం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇంటిఇంటికి తాగు నీరు అందించాలన ఉద్దేశంతో అధికారులు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా బోరు తవ్వి దాదాపు ఐదు నెలలు కావస్తున్న నేటి వరకు గుత్తేదారుడు పనులు ప్రారంభించక పోవడంతో గ్రామంలో తాగునీటి సమస్యకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధించిన అధికారులకు ఎన్నోసార్లు పిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పనులు ప్రారంభించి దాబుగుడ గ్రామంలో మంచినీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కె రమేష్, సింహాద్రి, వార్డ్ సభ్యులు రాము, గ్రామస్తులు జైసాన్,రఘురామ్, గురుమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతలు

సీలేరు - దారకొండ విద్యుత్‌లైన్‌కు
రూ.4 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు నుంచి దారకొండ వరకు విద్యుత్ సౌకర్యానికి నాలుగు కోట్లు మంజూరైందని దీనికి సంబంధించి డిపీరియల్ గూగుల్ పొజిషనింగ్ సిస్టం సర్వే నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఎడిఇ సన్ని రాంబాబు వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వేచేసి నివేదిక ను సీలేరు అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వారి నుంచి అనుమతులు వచ్చిన తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చింతపల్లి జికే వీధి మండలాలకు ఒకే విద్యుత్తు లైను ఉండ డంతో గాలి, వర్షం వచ్చే సమయంలో విద్యుత్ సరఫరాలో కొంత అంత రాయం ఏర్పడుతోందని దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సర్వేకు సంబంధించిన అనుమతులు తీసుకున్నామని 24 గంటలు విద్యుత్ సౌకర్యం కల్పించే దిశగా ప్రణాళిక ప్రకారం విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. సీలేరు నుంచి దారకొండ సబ్‌స్టేషన్ విద్యుత్తును అనుసంధానం చేస్తామన్నారు. ఈ పనులు పూర్తయితే జీకే వీధి చింతపల్లి మండలాలకు విద్యుత్ సౌకర్యానికి ఎటువంటి సమస్యలు తలెత్తదు అన్నారు. సీలేరు నుంచి దారకొండ వరకు విద్యుత్ సౌకర్యానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉండడంతో పాటు విద్యుత్ అవసరాలు పెరిగాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్‌కో సిఎండి గత ఏడాది 11వ నెలలో ప్రతిపాదనలు పంపగా ఒక్క నెల వ్యవధిలో అనుమతులతోపాటు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి దుప్పిలివాడ దారకొండ గుమ్మిరేవులు తదితర మారుమూల పంచాయతీ పరిధి గిరి గ్రామాలకు విద్యుత్తు లో వోల్టేజ్ సమస్య అధికంగా ఉండేది. సీలేరు నుంచి దారకొండ వరకు అటవీ మార్గంలో సుమారు తొమ్మిది కిలోమీటర్లు విద్యుత్ లైన్లతోపాటు స్తంభాలు అమర్చవలసి ఉంటుందని ఆయన తెలిపారు.

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సముద్ర జలాల్లో 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు

రాష్ట్ర మత్స్య, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొదటి విడతగా 22 కత్రిమ ఆవాసాల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ, సహకార, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పెదజాలారిపేట ఎండాడ సముద్రంలో సోమవారం ఆర్టిఫీషియల్ రీఫ్స్ (కత్రిమ ఆవాసాలు) విడుదలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలో ఈ కత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేయడం వలన మత్స్యసంపద వద్ధి చెంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు.ఉత్తరాంధ్ర జిల్లా సముద్రజలాల్లో మొదటి విడతగా 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు, భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర జిల్లాల తీరప్రాంత సముద్ర జలాల్లో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని మెకనైజ్డ్ బోట్లకు ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పిఎంఎంఎస్‌వై) కింద 634 ట్రాన్స్‌పాండర్స్ 100 శాతం సబ్సిడీపై అందజేసినట్లు తెలియజేస్తూ ట్రాన్స్‌పాండర్స్ వాడకం వలన సముద్రంలో బోటు యొక్క స్థానాన్ని తెలుసుకొనడం, తుఫానులు ఇతర ప్రకతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించేటప్పుడు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో మత్స్యకారులకు జిపిఎస్, ఎకోసౌండర్, బోట్లు, ఇంజన్స్, వలలు, తాళ్ళు వంటి పరికరాలు సబ్సిడీ పై సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.పెండింగ్‌లో డీజిల్ ఆయిల్ సబ్సిడీ,ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

స్థానిక ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్, క్రెడిల్స్ ఏర్పాటుకై పోర్ట్ ఛైర్మన్‌తో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెకనైజ్డ్ బోటు సంఘ అధ్యక్షులు సమస్యలను మంత్రిల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ కె బీచ్ ఎదురుగా మత్స్యశాఖ ద్వారా పిఎంఎంఎస్‌వై పథకం కింద ఏర్పాటు చేసిన కేజ్‌కల్చర్, సివీడ్ కల్చర్ యూనిట్ సందర్శించి మత్స్యకార యువత, మహిళలకు ఉపాధి, జీవనోపాధి మెరుగుపరుచుటకు ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్, రామశంకర్ నాయక్, విశాఖపట్నం మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, పి.లక్ష్మణరావు, సిఎమ్ఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కిజాకుడ్డీన్, స్థానిక కార్పొరేటర్ మర బోట్ల సంఘ అధ్యక్షులు ఎమ్.లక్ష్మణరావు, పి.సి.అప్పారావు, నర్సింగరావు, బాలాజీ, ఎండాడ,పెదజాలారిపేట, కొత్తజాలారిపేట మత్స్యకార నాయకులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

కృత్రిమ ఆవాస కేంద్రాలను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు

కేజ్ కల్చర్ ప్రారంభం

ప్రధానమంత్రి మత్స్యసంపదయోజన పథకంలో భాగంగా జాలారి ఎండాడ వద్ద చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన కత్రిమ ఆవాసాల కేంద్రాన్ని, ఫిషింగ్ హార్బర్‌జీరో జెట్టీ వద్ద సముద్రపు పాచి, చేపపిల్లల పెంపకానికి సంబంధించిన కేజ్‌కల్చర్‌ను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. అనంతరం జెట్టీ నెం.2 వద్ద జరిగిన సభలో మత్స్యకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా

ప్రజాశక్తి-చింతపల్లి: వాహనదారులు అప్రమత్తంగా వాహనాలు నడపాలని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా సూచించారు. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున ప్రమాదాల నివారణకు తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌతులపూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించడం బాధాకరమని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎఎస్పీ కార్యాలయంలో చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు, జాతీయ రహదారి నిర్మాణ సూపర్వైజర్ తిలక్‌తో కలిసి ఎఎస్పీ నవజ్యోతి మిశ్రా అత్యవసర సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు.అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, హైవేలో ప్రమాదకరమైన మలుపుల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, అవసరమైన లైటింగ్ వంటి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లు తడిసి ప్రమాదకరంగా మారుతున్నాయని, వాహనదారులు అధిక జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. ఒకే వాహనంలో ముగ్గురు ప్రయాణించడం, అతివేగంగా నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడడం వంటి ఉల్లంఘనలు చేస్తే సీసీ కెమెరా ఆధారంగా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సభలో మాట్లాడుతున్న హర్ష వర్ధన్ ప్రసాద్

ఘనంగా టిడిపి మహానాడు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బడుగు, బలహీన వర్గాల కోసం పుట్టిన పార్టీ టిడిపి అని, వచ్చే ఎన్నికల వరకు టిడిపి పాడేరు నియోజకవర్గ ఇంచార్జీగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కొనసాగుతారని ఆ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు హర్ష వర్ధన్ ప్రసాద్ అన్నారు. టిడిపి పాడేరు ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని కాఫీ హౌస్ లో సోమవారం నియోజకవర్గ మహానాడు ఘనంగా జరిగింది. సభకు టిడిపి నాయకులు గంగపూజారి శివ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల కోసం పోరాడామని, అధికారంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నామన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. టిడిపి నాయకులు ప్రసాద్, బొర్రా నాగరాజు, విజయరాణి, రమణమూర్తి, పార్టీ జడ్ పిటిసిలు, ఎంపిపిలు ఎంపిటిసిలు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, బూత్, పంచాయతీ, గ్రామ కమిటీ అధ్యక్షులు, టిడిపి, ఎన్ టిఆర్, అభిమానులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రిఫరల్ కేసుల తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుండి కెజిహెచ్ లేదా వేరే ఆసుపత్రులకు రిఫర్ చేయు సందర్భంలో అంబులెన్స్ డ్రైవర్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం వల్ల రోగి మరణిస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. అదేవిధంగా రిఫర్ చేయడంలో తాత్సారం వహిస్తే సంబంధిత డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం జిజిహెచ్ పని తీరుపై జిజిహెచ్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, చికిత్సల్లో మరణాలు తగ్గించే విధంగా, రిఫరల్స్ తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని, రోగి అవుట్ పేషంట్ గా అడ్మిట్ అయిన వెంటనే తగు చికిత్స అందించి అవసరమైతే ఇన్ పేషంట్ గా చికిత్సలు అందించాలన్నారు. వైద్యపరంగా చికిత్సల్లో నిర్లక్ష్యాన్ని సహించబోనని హెచ్చరించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ కేటగిరీల చికిత్సలపై ఆరా తీసారు. రోగిని రిఫర్ చేస్తే ఇక్కడ పంపిన సమయం, అక్కడ చేర్చుకున్న సమయం కేస్ షీట్ లో విధిగా నమోదు చేయాలని ఎప్పటికప్పుడు రోగి పరిస్థితిపై ఆరా తీయాలని సూచించారు. ఈ విషయమై జేసి 15రోజులకు ఒకసారి సమీక్షించాలని ఆదేశించారు. జిజిహెచ్ కు కేటాయించిన అంబులెన్స్ ల వివరాలపై ఆరా తీసిన కలెక్టర్ ఒక అంబులెన్స్ మరమ్మత్తుల్లో ఉందని తెలుసుకుని ఒకటి రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసి ఎంజె అభిషేక్ గౌడ, ఆసుపత్రి పర్యవేక్షకులు విశ్వ మిత్ర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత దేవి, డిఎంహెచ్ఓ సి జమాల్ బాషా, డిసిహెచ్ఎస్ లక్ష్మి, గైనకాలజీ హెడ్ నరసింగ రావు, జనరల్ మెడిసిన్ హెడ్ సురేష్, రెడ్ క్రాస్ ప్రతినిధి సూర్యారావు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో..

ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ

మాట్లాడుతున్న డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- అరకులోయ: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేయాలని, మెగా డీఎస్సీలో ఆదివాసీ ప్రాంతంలో నోటిఫై చేసిన 4680 ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేశారు.అరకులోయలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ పొద్దు బాలదేవ్ గిరిజన సంఘం భవనం లో జిల్లా మండల కోకన్వీనర్లు మద్దు మోహన్, నన్ని జాన్ బాబు,పాంగి అశోక్, కిల్లో జగన్నాధం, పాంగి నానిబాబు తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ,ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 న చలో రైల్ రోకో కు పిలుపు ఇవ్వడంతో ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి,సబ్ కలెక్టర్ లతో చర్చలు జరిపించిందని, జిల్లా కలెక్టర్ ద్వారా నివేదిక కోరిందని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ విన్నవి పత్రం ఆధారంగా నివేదిక ఇచ్చారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 20న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మెగా డీఎస్సీ నుండి షెడ్యూల్ ఏరియా ఆదివాసీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేసే విధంగా ఆదివాసులకు అనుకూలంగా తీర్మానం చేయాలన్నారు.100 శాతం రిజర్వేషన్ మాత్రమే ఆదివాసీ సమాజం కోరుకుంటుందని, ఆదివాసులకు హామీ ఇచ్చి కాలయాపన చేస్తే కూటమి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆదివాసీలు పోరాటానికి సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు.

రహదారిపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో మోదకొండమ్మ జాతర నేపథ్యంలో మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అధ్యక్షులు, ఎంపీటీసీ కె బొంజుబాబు ఆధ్వర్యాన పూడ్చివేత పనులు చేపట్టారు. జాతరకు వచ్చిన చిరువ్యాపారులు దుకాణాలు పెట్టుకోవడానికి ఇబ్బందికరంగా ఉండటం తో సంతరోజు అయినప్పటికీ భక్తులకు ఇబ్బంది కలగకుండా రూ.15 వేల ఖర్చుతో క్రషర్ బొగ్గుతో గోతులను సరి చేశారు. దీంతో, స్థానికులు, వ్యాపారులు ఉత్సవ కమిటీని అభినందించారు

క్రషర్ బుగ్గిని వేయిస్తున్న కమిటీ సభ్యులు

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న బైక్ : ఇద్దరు మృతి

ప్రజాశక్తి -పెదబయలు : మండలంలోని కొత్తాపుట్టు జంక్షన్ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అడుగులుపుట్టు పంచాయతీ కొత్తపుట్టు జంక్షన్ వద్ద బైక్ పై ఇద్దరు వ్యక్తులు వెళుతున్నారు. బైక్ చెట్టును ఢీకొంది.ఈ సంఘటనలో ఒక వ్యక్తి సంఘటన స్థలంలో మరణించగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో ముంచంగిపుట్టు ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కూడా మరణించాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్ఐ సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఏ.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. హుకుంపేట ఎస్సైగా పనిచేస్తున్న ఎస్ సురేష్ సాధారణ బదిలీ అవడంతో ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా ఏ.సూర్యనారాయణ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, గతంలో పాడేరు ఎస్సై గా పనిచేస్తూ బదిలీపై హుకుంపేటకు రావడం జరిగిందన్నారు. గిరిజనులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువకులు చెడు వ్యసనాల కు దూరంగా ఉండాలన్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో మోద కొండమ్మ జాతర నేపథ్యంలో సీకారి పంచాయతీ కేంద్రంలో సత్యసాయి బాబా సేవ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో సుమారు వెయ్యి మందికి ఉచితంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ, బాబా పేరిట అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామములో మంచినీరు సమస్య ఉంటే తెలియపరిస్తే వారం రోజుల్లో ట్రస్ట్ ద్వారా అందిస్తామని పేర్కొన్నారు.

వడ్డిస్తున్న నిర్వాహకులు

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి- విశాఖకలక్టరేట్: తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లిజిల్లా, కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయని, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత నదులు, భూగర్భ సరస్వతి నదితో కలిసే పవిత్ర సంగమం వద్ద ప్రత్యేకంగా నిర్వహించబడే పుష్కరాలకు వెళ్లే యాత్రికుల కోసం విశాఖపట్నం ఎపిఎస్ఆర్టిసి ఈ నెల 23న మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. విశాఖపట్నం కాంప్లెక్స్ నుంచి బయలుదేరి కాలేశ్వరం వెళ్లి తిరుగు ప్రయాణంలో భద్రాచలం దేవాలయంలో రాములవారి దర్శించుకుని రావడానికి సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రెండువైపులా కలిపి ప్రయాణ చార్జీలు ఒక మనిషికి రూ.2700 మాత్రమే అన్నారు.టికెట్స్ కావలసినవారు ఆన్‌లైన్‌లో https://www.apsrtconline.in వెబ్ సైట్‌లో విశాఖపట్నం సరస్వతి పుష్కరాలు రూట్ సెలెక్ట్ చేసి సీట్లు రిజర్వ్ చేసుకోవాలన్నారు.రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా టికెట్స్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. 34మంది కలసి వస్తే వారికి అనుకూలమైన రోజున బస్సులను ఏర్పాటు చేస్తామని ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలు కూడా చేర్చి ఈ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 8309265666, 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లతో సంప్రదించాలన్నారు.

భానుప్రియను సత్కరిస్తున్న మంత్రి సర్బానంద సోనోవాల్

హెచ్‌ఎస్‌ఎల్ మహిళా ఎగ్జిక్యూటివ్ భానుప్రియకు సత్కారం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్, పోర్టులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వశాఖ, సాగర్ మెయిన్ సమ్మాన్, ది మారిటైమ్ యూనియన్ ఆఫ్ ఇండియా, నేషనల్ మారిటైమ్‌డే సెలబ్రేషన్స్ కమిటి సంయుక్తంగా ముంబై శాంటాక్రూజ్ (తూర్పు)లోని తాజ్ హోటల్‌లో ఆదివారం అంతర్జాతీయ మారిటైమ్ మహిళల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఎల్ డిప్యుటి జనరల్ మేనేజర్ (డిజైన్‌అండ్ బిడిడి) ఎం.భానుప్రియను సత్కరించారు. హైడ్రోజన్ శక్తితో నడిచే టగ్‌ల రూపకల్పనలో గ్రీన్ షిప్‌బిల్డింగ్ టెక్నాలజీను అభివృద్ధి చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించినందుకు ఆమెను ఈ గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా మే 18న అంతర్జాతీయ సముద్ర మహిళా దినోత్సవం జరుగుతుంది. మహిళా నిపుణుల నాయకత్వం, అంకితభావం సేవలను గౌరవించడానికి నేషనల్ మారిటైమ్ డే సెలబ్రేషన్స్ కమిటీ ప్రతి సంవత్సరం ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

మహానాడును విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు మహానాడు గొప్ప వేదిక అని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. ఉత్తర నియోజకవర్గం టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మే 27,28,29 తేదీల్లో నిర్వహించే మహానాడుకి ముందు శాసనసభ , పార్లమెంటు నియోజకవర్గాల వారీగా నిర్వహించి కార్యకర్తల ద్వారా సమస్యలను తెలుసుకుని తీర్మానం చేసి పార్టీ అధిష్టానానికి పంపిస్తామన్నారు.

కార్యక్రమంలో రాష్ట్రపార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, కార్యదర్శి లొడగల కష్ణ, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వెల్లంకి భరత్, జిల్లా నాయకులు పైలాముత్యాలనాయుడు, గొంప సత్యనారాయణ, బొడ్డేటి మోహన్, రాజమండ్రి నారాయణ, ఈతలపాక సుజాత, కోట నరేష్, బొడ్డేపల్లి లలిత, వరప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నిక సాక్షిగా

బయటపడ్డ 'కూటమి' విభేదాలు

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ఆడబిడ్డ నిధి అమలుకు మంగళం

పీ4తో ఆడబిడ్డ నిధిని ఎలా ముడిపెడతారు?

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: విశాఖపట్నం జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక సాక్షిగా కూటమి పార్టీల మధ్య ఉన్న లుకలుకలు బయటపడ్డాయని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ అన్నారు. సోమవారం బీచ్‌రోడ్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక కోరం లేకపోవడం వల్ల వాయిదా పడింది. కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్ల మధ్య తేడాలు ఉండటం వల్ల కోరంనకు సరిపడే కార్పొరేటర్లు ఈ ఎన్నికకు హాజరు కాలేదని తెలుస్తోంది. కూటమి పార్టీలకు అధికారం, దానిని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే ముఖ్యం. ప్రజలకు మంచి పాలన అందించాలనే ఆలోచనే లేదన్నారు. తమకు మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు వస్తే, దానిని అడ్డం పెట్టుకుని దోచుకోవాలనేదే వారి ఉద్దేశం. కూటమి పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే, కోరంనకు సరిపడా సంఖ్యాబలం ఉండి కూడా డిప్యూటీ మేయర్ ఎన్నికను ఎందుకు చేయించుకోలేకపోయారు. సుమారు 63 మంది కార్పొరేటర్లు వారికి ఉండి కూడా దాదాపు ఇరవై మందికి పైగా కార్పొరేటర్లు ఈ ఎన్నికకు గైర్హాజరు అయ్యారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే, కూటమి పార్టీలకు అధికారం మాత్రమే ముఖ్యమని తెట్టతెల్లమవుతోందని అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఆడబిడ్డ నిధి పేరుతో పద్దెనిమిది ఏళ్ళ నుంచి 59 ఏళ్ళ లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చాయి. మూడు రోజుల కిందట చంద్రబాబు మాట్లాడుతూ ఈ పథకాన్ని పి4లో పెట్టాను, దానిలో చూస్తాను అని చెప్పారు. పి4కి, ఆడబిడ్డ నిధికి సంబంధం ఏమిటి? ఏడాదికి రూ.18,000 ఇస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తోంది. రాష్ట్రంలోని దాదాపు అర్హులైన కోటి మందికి పైగా మహిళలకు ఎప్పుడు ఆడబిడ్డ నిధిని ఇస్తారు? బీజేపీ, జనసేనలు కూడా చంద్రబాబు మాటలను సమర్థిస్తున్నారా?

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఆడబిడ్డ నిధిని ఎప్పుడు ఇస్తారో ప్రకటించాలని ప్రతిపక్షంగా వైఎస్ఆర్‌సిపి తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ముందుగా మోసపోయేది మహిళలే. వారిని సునాయాసంగా నమ్మించి మోసగించడం చంద్రబాబుకు అలవాటు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అంటూ మహిళలను ఇలాగే మోసం చేశారు. తల్లికివందనం గత ఏడాది పూర్తిగా పథకం అమలుకాలేదు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచిన తరువాత ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప, అది కార్యరూపంలోకి వస్తుందా రాదా అనేది అనుమానంగా ఉందన్నారు. హామీలను విస్మరిస్తే ప్రతిపక్షంగా చూస్తూ ఊరుకోమని అక్కచెల్లెమ్మలకు న్యాయం జరిగే వరకూ వైఎస్ఆర్‌సిపి వారికి అండగా నిలబడి పోరాడుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్ఆర్‌సిపి పూర్తి వ్యతిరేకం

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ప్రధాని మోడీ సమక్షంలోనే వైయస్ జగన్ చాలా స్పష్టంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కానీ ఇటీవల ప్రధాని రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో కూటమి ప్రభుత్వం మాత్రం ఎందుకు ప్రధానిని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎందుకు నిలదీయలేదు అని ప్రశ్నించారు.

అధిష్టానం దృష్టికి నాయకుల, కార్యకర్తల సమస్యలు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ నేతలు, సీనియర్ క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ జాతీయ నాయకురాలు కిల్లి కృపారాణి హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని సింకా గ్రాండ్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీనేతలు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. నాయకులు,కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పలువురు నాయకులు తమ సమస్యలు తెలియజేశారు.ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కృపారాణి మాట్లాడుతూ పార్టీ నాయకులు తీసుకొచ్చిన సమస్యలను కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలతో కలిసి పని చేస్తానని తెలియజేశారు. సమావేశంలో పిసిసి మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది.ఈ మేరకు నగర పరిధిలోని మహారాణిపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ లచ్చపాత్రుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మథరావు, సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలం అర్హులైన పేదలకు ఇచ్చి నాలుగు లక్షల ఇల్లు నిర్మాణానికి ఇస్తామని ప్రకటన చేసిందన్నారు. పట్టణాల్లో మురికివాడల్లో నివసిస్తున్న అర్హులైన పేదలందరూ ఇప్పటికే దరఖాస్తులు ఇవ్వడం జరిగిందని, సర్వే నిర్వహించి రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలం ఇవ్వాలని,అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రకటన చేశారు తప్ప దాని అమలుకు నోచుకోవటం లేదని, పథకం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాత్రికేయులంటే చంద్రబాబుకు చులకన

జర్నలిస్టు సాధిక్‌కు వాసుపల్లి రూ.5 వేలు ఆర్థిక సాయం

నగదు అందిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: అధికారదాహంతో కొట్టుమిట్టాడుతున్న కూటమి ప్రభుత్వానికి జర్నలిస్టులు అంటే అంత చులకన భావన తగదని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దుయ్యబట్టారు. ఆసీలమెట్ట కార్యాలయంలో సోమవారం పాత్రికేయుడు సాదిక్ భార్య ఎండి రషీదా బేగం వైద్యఖర్చులకు రూ.5 వేలు నగదును వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు. గైనిక్ సమస్యతో బాధపడుతున్న ఆమెకు వైద్యఖర్చుల నిమిత్తం నగదు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అక్రిడేషన్లు మంజూరు చేసి, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా చేశారన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిపోయిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు తిరిగి వైసిపి ప్రభుత్వం వస్తే న్యాయం చేస్తామని తెలిపారు. చంద్రబాబు అధికారం చేపట్టి దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ కనీసం జర్నలిస్టులకు అక్రిడేషన్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. జివిఎంసి మేయర్ డిప్యూటీ మేయర్ పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు, జనసేన నేతలు మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 27వ వార్డు వైసిపి అధ్యక్షుడు సర్వేశ్వర్ రెడ్డి, చింతకాయల వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

టొయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: టొయోటా కిర్లోస్కర్ మోటర్ తమ 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'ను ప్రారంభించింది. ఈ సందర్భంగా విశాఖపట్నంలో ఎంవిపి కాలనీ టయోటా షోరూంలో జరిగిన కార్యక్రమంలో టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ సౌత్ రీజియన్ చీఫ్ రిప్రజెంటేటివ్ వైస్‌లైన్ సిగామణి మాట్లాడుతూ ఈ ఆఫర్స్ దక్షిణ భారతదేశంలోని టొయోటా డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. కొత్తకారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం వంటి ఆకర్షణీయమైన డీల్స్ అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఈ మెగా సమ్మర్ సెలబ్రేషన్‌లో భాగంగా తమ 'కస్టమర్-ఫస్ట్' సిద్ధాంతానికి కట్టుబడి, కార్‌సర్వీస్, ఉపయోగించిన కార్ల కొనుగోలుపై కస్టమర్‌లకు విలువైన బహుమతులు అందించడం ఈ ప్రచారం లక్ష్యం అన్నారు. ఈ సెలబ్రేషన్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణలో టయోటా అధీకత డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉందన్నారు.

ఉక్కు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నిర్బంధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును, కార్మికులను అష్టదిగ్బంధనం చేస్తోందని తెలిపారు. సంస్థ ఉత్పత్తిలో దశాబ్దాల తరబడి కీలక విధులు నిర్వహిస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అమానుషంగా తొలగించిందన్నారు. మరో 2600 మందిని తొలగించడానికి సిద్ధపడిందని తెలిపారు. అర్థాంతరంగా తొలగిస్తుంటే వారి కుటుంబాలు ఏం కావాలి ? అని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను పూర్తిగా కాలరాస్తున్నారని, ఇది అన్యాయమని అడిగిన కార్మికులను, నాయకులను ఇది కేంద్ర ప్రభుత్వ ఆదేశమంటూ నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని తెలిపారు. వార్నింగ్ లెటర్లు ఇస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులకు, యూనియన్ నాయకులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని, సస్పెన్షన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిది నెలలుగా పూర్తి జీతాలు ఇవ్వడం లేదన్నారు. విఆర్ఎస్ పేరుతో కార్మికులను వేల సంఖ్యలో తగ్గిస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుతామంటూనే సంస్థను, ఉత్పత్తి కారకులైన కార్మికులను అష్టదిగ్బంధనం చేస్తున్నారని చెప్పారు.